సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 14 । జూన్ । 2024



అటవీ భూములు దున్నారని..

ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను దున్నేసిన వారిపై కేసు నమోదు చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

నేడు ధ్రువపత్రాల పరిశీలన

అనంతగిరి: జిల్లాలోని స్పెషల్ బీఎడ్ చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు శుక్రవారం ఉదయం 11గంటలకు డీఈఓ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డీఈఓ రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను ఒరిజినల్ సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్స్, ర్యాంకు కార్డు, అపాయింట్మెంట్ ఆర్డర్ రెండు సెట్ల జిరాక్స్ తీసుకుని హాజరుకావాలని సూచించారు. వీటితో పాటు సంబంధిత ఫార్మాట్ తీసుకుని రాగలని డీఈఓ సూచించారు.

యాలాలకు నలుగురు జీహెచ్‌ఎంలు

యాలాల: స్కూల్ అసిస్టెంట్లకు కల్పించిన పదోన్నతుల్లో భాగంగా యాలాల మండలానికి కొత్తగా నలుగురు జీహెచ్‌ఎంలు వచ్చారని మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాస్నం ఉన్నత పాఠశాలకు సతీష్‌కుమార్, పగిడియాల పాఠశాలకు కృష్ణయ్య, దేవనూరు పాఠశాలకు మాధురి, అగ్గనూరు పాఠశాలకు సుధాకర్.. జీహెచ్‌ఎంలుగా చేరినట్లు తెలిపారు. మండలంలోని 10 ఉన్నత పాఠశాలల్లో (బెన్నూరు ఉన్నత పాఠశాల మినహా) అన్ని పాఠశాలలకు జీహెచ్‌ఎం పోస్టులు భర్తీ అయ్యాయని ఆయన పేర్కొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల శిక్షణకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మల్లేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 సివిల్స్ పరీక్షలకు సంబంధించి ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్‌తో శిక్షణ ఇస్తారన్నారు. అర్హులు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించరాదని ఆయన అన్నారు. జూన్ 30లోపు ఆన్‌లైన్లో మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్.62817 66534 నంబరును అన్ని పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించగలరని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీ ఇవ్వాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఐజేయూ ప్రతినిధులు

అనంతగిరి: జిల్లాలో పనిచేసే జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులో రాయితీ ఇవ్వాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీధర్ కోరారు. ఈమేరకు గురువారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాఘవేందర్, సభ్యులు.. చంద్రశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌కు రూ.73 కోట్లు మంజూరు

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.73.45 కోట్లు మంజూరు చేశారు. వీటిని బీసీ గురుకుల విద్యాలయాల నిర్మాణం కోసం వెచ్చించనున్నారు. బీసీ గురుకుల జూనియర్ కళాశాల నిర్మాణానికి రూ.25 కోట్లు, బీసీ గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.23.45 కోట్లు, బొంరాస్‌పేటలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలకు రూ.25 కోట్లు కేటాయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తైన వెంటనే పనులు ప్రారంభం అవుతాయని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

చెరువులు, చెట్లను పరిరక్షించుకుందాం

అటవీ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి

శంకర్‌పల్లి: చెరువులు, చెట్లను పరిరక్షించుకోకపోతే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి ఆవేదన వ్యక్తం చేశారు. మండల రిధిలోని ప్రొద్దటూరు పెద్ద చెరువు వద్ద గురువారం శాస్త్రవేత్తలు, పలు శాఖల అధికారులతో కలిసి తడి నేలల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులతో కలిసి చెరువు కట్టపై మొక్కలు నాటి, నీరు పోశారు. చెరువుల కబ్జాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త మురుగనందన్, ఎస్‌ఈ రంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో లిక్కర్ కిక్కు!

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- కిరాణా దుకాణాల కన్నా బెల్టు షాపులే అధికం
- ఎన్నికల కోడ్ ముగియడంతో పర్యవేక్షణ కరువు
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న ఎక్సైజ్, పోలీస్ శాఖలు



వికారాబాద్: బెల్టు దుకాణాల కట్టడి కేవలం ఎన్నికల కోడ్‌కే పరిమితమయ్యింది. కోడ్ అమల్లో ఉన్న సమయంలో అధికారులు జిల్లాలోని బెల్టుషాప్‌లను కట్టడి చేయడంతో పాటు వందల సంఖ్యలో కేసులు నమోదు చేసి, బైండోవర్లు సైతం చేశారు. దాడుల్లో దాదాపు 3,500 లీటర్లకు పైగా మద్యం సీజ్ చేశారు. అయితే కోడ్ ఎత్తివేసిన అనంతరం పోలీసుల పర్యవేక్షణ గాలికొదిలేయడంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో కిరాణా దుకాణాల కంటే బెల్టుషాపులే అధికంగా ఉండటమే దీనికి ఉదాహరణ. అయితే బెల్టుషాపుల నిర్వహణ మొత్తం ఎక్సైజ్ శాఖ కనుసన్నల్లోనే జరుగుతుందనే విమర్శలు సైతం లేకపోలేదు.

మామూళ్ల మత్తులో అధికారులు

తండాలు, గిరిజన గూడాలు, మారుమూల అటవీ ప్రాంతాల్లో ఉండే గుడుంబాను కట్టడి చేసిన ఎక్సైజ్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే బెల్టుషాపులను అరికట్టలేరా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బెల్టు దుకాణాల్లో ప్రతీ మద్యం బాటిల్‌ను రూ.10 నుంచి రూ.50 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అయితే ఎక్సైజ్ శాఖ అధికారులు అడపాదడపా చేస్తున్న దాడుల్లో బెల్టు దుకాణాల నిర్వాహకులు పట్టుబడితే.. లైసెన్స్‌డ్ మద్యం దుకాణదారులే వారికి రక్షణగా నిలుస్తున్నారు. వారి పలుకుబడితో కేసులు సైతం కాకుండా చూస్తున్నారు. దీంతో ఆయా బెల్టుదుకాణాల నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖలోని అధికారులందరికీ ఆయా బెల్టు దుకాణాలు, వాటికి మద్యం సరఫరా చేసే లైసెన్స్‌డ్ దుకాణాల నుంచి మామూళ్లుఅందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో మద్యం దుకాణం ద్వారా ఎక్సైజ్ పోలీసులకు నెలకు రూ.17వేల నుండి రూ.20 వేల వరకు, సివిల్ పోలీసులకు నెలకు రూ.15వేలు అందుతున్నట్లు సమాచారం. బెల్టుషాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గల్లీకో బెల్టు దుకాణం

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం విషయంలో ఎక్సైజ్, సివిల్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నాటుసారాపై ఉక్కుపాదం మోపటంతో.. మద్యం అమ్మకాలు నాలుగింతలు పెరగటానికి కారణమనేది స్పష్టమవుతోంది. ఒక్కో ఎక్సైజ్ ఠాణా పరిధిలో 400 వరకు బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో మొత్తంగా 1,600 నుంచి 1,800 పైచిలుకు బెల్టు షాపులు ఉన్నట్లు అంచనా. దాబాలు, కిరాణా దుకాణాలు ఇలా ఎక్కడపడితే అక్కడ మద్యం విక్రయిస్తున్నారు. ప్రతీ గల్లీకో మద్యం దుకాణం దర్శనమిస్తోంది. రోజు రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. నేరుగా లైసెన్స్‌డ్ దుకాణదారుడికి గిరాకీ 30శాతం ఉంటుండగా బెల్టుషాపుల ద్వారానే 70 శాతం మద్యం విక్రయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది.





• ఆహా.. ఏమి ఆహ్లాదం

చెట్టు అనగానే గుర్తొచ్చే మాట పచ్చని ఆకులు. అలాంటి పచ్చని ఆకులు ఉన్న ఆ చెట్టుకు ఎర్రని పువ్వులు పూశాయి. ఆ ఆహ్లాదం చూడటానికి రెండు కళ్లూ చాలవు. దానికి తోడు చెట్టు కింద ఆ పువ్వులే రాలిపడి ఎర్రని తివాచీలా ఉండటంతో మరింత ఆకర్షణగా ఉంది. దుద్యాల నుంచి లింగంపల్లి వెళ్లే దారిలో ఈ అద్భుతమైన దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులను, చూపరులను ఈ చెట్టు ఎంతగానో ఆకట్టుకుంటోంది. – దుద్యాల్



ప్రమాద స్థలంలో ఆటో వద్ద గుమిగూడిన జనం

ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్

- ఇద్దరి దుర్మరణం, పలువురికి గాయాలు
- చించల్‌పేట గేట్ సమీపంలో ప్రమాదం



కిష్టయ్య మృతదేహం

అనంతగిరి: ఆటోను.. సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన వికారాబాద్ మండల పరిధిలోని చించల్‌పేట గేట్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు.. నవాబ్‌పేట మండలం ఎల్లకొండకు చెందిన ఓ కుటుంబం తమ బంధువులతో కలిసి వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లికి ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఆటోలో వస్తున్నారు. ఈక్రమంలో చించల్‌పేట గేట్ వద్ద వికారాబాద్ వైపు నుంచి వస్తున్న ఓ సిమెంట్ ట్యాంకర్ ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలోని ప్రాయణికులు చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో గొల్లగూడ కిష్టయ్య (60)కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ షాకీర్, ప్రయాణికులు.. బుచ్చమ్మ, సత్యమ్మ, అంతయ్య, రాంచంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని 108లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. కాగా క్షతగాత్రుల్లో బుచ్చమ్మ (53) చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరికొందరికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ నాగరాజు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కబళించిన మృత్యువు



మధులత (ఫైల్)

- పొలం పనులు చేస్తుండగా పిడుగు పడి వివాహిత మృతి
- తాండూరు మండలం కరన్‌కోట్‌లో ఘటన

తాండూరు రూరల్: పెళ్లి వేడుక జరిగి ఏడాది తిరగకముందే ఆ ఇంట్లో విషాదం నెలకొంది. కూలి పనులకు వెళ్లిన వివాహితను పిడుగు రూపంలో మృత్యువు కబళించిన విషాదకర సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్‌కోట్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు.. కరన్‌కోట్‌కు చెందిన పర్శు మహేశ్‌కు దుద్యాల మండల కేంద్రానికి చెందిన మధులత (23)తో ఏడాది క్రితం వివాహం జరిపించారు. మహేశ్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా మధులత కూలి పనులకు వెళ్తోంది. రోజూ మాదిరిగానే గురువారం తోటి కూలీలతో కలిసి గ్రామానికి చెందిన శరణు బసప్ప పొలంలో పత్తి విత్తనాలు విత్తేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఒక్కసారిగా వర్షం మొదలైంది. అదే సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో మధులతతో పాటు దస్తమ్మ కిందపడిపోయారు. వీరిని కరన్‌కోట్ ఆస్పత్రికి తరలించగా మధులత పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మధులత అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

సమన్వయంతో పనిచేయండి

మొయినాబాద్‌రూరల్: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మిషన్ భగీరథ నీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఉమ్మడి జిల్లా మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ చంద్రమౌళి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రెండు జిల్లాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్ల ద్వారా ఇంటింటి సర్వే కొనసాగుతోందని తెలిపారు. నల్లా కనెక్షన్ లేని చోట కొత్త కనెక్షన్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందరికీ తాగునీరు అందించాలనేదే ప్రభుత్వ సంకల్పమని.. ఎక్కడా నీటి సమస్య రాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ నక్షత్రం జీవంతు, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ డిప్యూటీ డీఈ ఇర్ఫాన్, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించాలి

- అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించండి
- పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ శశాంక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చెరువుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన నిర్మాణాలను తొలగించాలని, చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో జోనల్ కమిషనర్, అదనపు డీసీపీలతో కలిసి చెరువులు, నాలాల పరిరక్షణపై మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించడమే కాకుండా వారిపై పోలీసు చర్యలు తీసుకునేలా అధికారులు వ్యవహరించాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల చుట్టూ ఫెన్సింగ్, హద్దు, సంరక్షణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

64 చెరువులకు పూర్వ వైభవం

శేరిలింగంపల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 64 చెరువులను పరిరక్షించి, పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ శాఖలతో కలిసి నోటిఫైడ్ చేసిన చెరువు వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పత్రాలను పొందుపర్చాలన్నారు. ప్రజాక్షేత్రంలో ఎఫ్‌టీఎల్ హద్దు మ్యాప్‌ల అంతిమ నోటిఫికేషన్‌ను జారీ చేయడానికి అధికారులను నోడల్ ఏజెన్సీగా నియమించుకొని చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల సంరక్షణకు ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, చెరువు భౌగోళిక స్వరూపం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, ప్రాంతం, రెవెన్యూ మండలం వివరాలపై సమగ్ర స్థాయిలో సర్వే చేయాలన్నారు. కబ్జాలకు ఆస్కారం లేకుండా చెరువుల చుట్టూ ఫెన్సింగ్, పకడ్బందీ వివరాలతో చెరువు మ్యాపులను, సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

15 రోజుకోసారి నివేదిక ఇవ్వండి

శేరిలింగంపల్లి పరిధిలో ఉన్న చెరువులకు సరస్సు ఇన్‌చార్జి అధికారులను నియమించడం జరిగిందని జోనల్ కమిషనర్ స్నేహా షబరీష్ అన్నారు. సరస్సుల వద్ద సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సరస్సు ఇన్‌చార్జులుగా నియమించబడిన అధికారులు ప్రతిరోజూ సరస్సుకు సంబంధించిన నిర్దిష్ట రిఫరెన్స్ పాయింట్‌ను సందర్శించి, చెరువుల వారీగా రిజిస్టర్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సరస్సుల్లో నీటి మట్టాలపై సందర్శించిన వెంటనే ఆయా వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు చెరువులను పర్యవేక్షించిన వెంటనే ఏమైనా అక్రమ నిర్మాణాలు, సీ అండ్ డీ వ్యర్థాలను డంపింగ్ చేయడం, చెత్తను డంపింగ్ చేయడం, సరస్సులోకి డ్రైనేజీ, కెమికల్ వాటర్ ఇన్‌ఫ్లో వంటివి గమనిస్తే వెంటనే సైట్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్, డిప్యూటీ కమిషనర్ (ఎస్డబ్ల్యూఎం), శేరిలింగంపల్లిజోన్ పరిధిలోని చెరువుల స్థితిపై 15 రోజులకు ఒకసారి నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలపై దృష్టి: ఏటీడీఓ

కడ్తాల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, మరింత మెరుగ్గా రాణించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి(ఏటీడీఓ) ఉడతనూరి వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలపై హెచ్‌ఎం బాలరాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఆహారం విషయంలో సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేందుకు వీలుగా గతేడాది నుంచే 3 నుంచి 10వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన ప్రారంభించినట్లు తెలిపారు. మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 2023–24 విద్యాసంవత్సరం పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కడ్తాల్ గిరిజన బాలుర వసతి గృహంలో ఉంటూ ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరైన 55 మంది విద్యార్థులకు గాను 54 మంది ఉత్తీర్ణత సాధించడంపై వసతిగృహ సంక్షేమాధికారి రాములును ఏటీడీఓ అభినందించారు. అనంతరం ఆయన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు.

అన్యాయాన్ని సహించేది లేదు



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు, నాయకులు

- ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత
- సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: ఆశ వర్కర్లకు ప్రభుత్వం అన్యాయం చేస్తే సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత హెచ్చరించారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ.. ప్రతీ నెల 2వ తేదీన పారితోషకాలు ఇవ్వాలని, గతంలో ఇచ్చినట్లుగా ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు చెల్లిస్తూ సర్క్యులర్ జారీ చేయాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని, ఇస్తున్న పారితోషకంలో సగం జీతం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని అలవెన్స్‌లు అందజేయాలని, పరీక్షల నిర్వహణ కోసం డ్యూటీలు వేస్తున్న ఆశాలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేధింపులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, మూడేళ్ల పెండింగ్ యూనిఫాంలు ఇవ్వాలని, పని భారం తగ్గించి జాబ్‌చార్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు సాయిబాబా, నాయకులు ఎల్లేష్, ప్రవీణ్, పోచమోని కృష్ణ, శేఖర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఫుడ్ మేళా

తాండూరు టౌన్: వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో ఫుడ్ మేళా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోట్రిక నాగలక్ష్మి, మంకాల స్వప్న గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాకు అందరూ ఆహ్వానితులేనన్నారు. రుచికరమైన వంటకాలు, వినోద కార్యక్రమాలను వీక్షించాలని వారు కోరారు.

బీసీ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



వార్డెన్ చంద్రకళ

పరిగి: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతిగృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ చంద్రకళ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకుంటున్నామని చెప్పారు. ఆసక్తి విద్యార్థినులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటుగా ఆధార్‌కార్డు జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, గతేడాది మార్కుల జాబితా(ప్రోగ్రెస్ కార్డు), ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనోఫైడ్ తీసుకుని హాస్టల్‌కు రావాలన్నారు. వివరాలకు 9441186919 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేంద్రమంత్రికి శుభాకాంక్షలు



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మారుతి కిరణ్

పరిగి: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ రాజకీయాల్లో ఉన్నత సేవలు అందించి మరింత ఖ్యాతిని గడించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

పెద్దేముల్: విద్యుదాఘాతంతో ఓ కాడెద్దు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. బోయిన చిన్న మొగులప్ప వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతేడాది రూ.1.80లక్షలతో కాడెడ్లను కొనుగోలు చేశాడు. ఓ రైతు పొలం చుట్టూ వేసిన కంచెకు విద్యుత్ వైర్ తగిలి కరెంటు సరఫరా అయింది. మేత మేస్తున్న ఎద్దుకు కంచె దగ్గరకు వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. వ్యవసాయ పనులు జరుగుతున్న సమయంలో రైతు ఎద్దు మృత్యువాత పడడంతో కన్నీరుమున్నీరయ్యాడు. ఎద్దు విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

చేవెళ్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సైతం సిద్ధంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న షాద్‌నగర్‌లో ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బీకేఎంయూ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సు షాద్‌నగర్‌లో 15వ తేదీన ఉ. 11 గంటలకు ఉంటుందని చెప్పారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకోసం తీసుకువచ్చిన ఈ పథకానికి నిధులు విడుదల చేయకుండా పనులు చేసిన కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

పత్తాలేని భూసార పరీక్షలు

ఏడాదికి మూడు సార్లు చేయాల్సిన భూసార పరీక్షలు కొన్ని ఏళ్ల నుంచి నిర్వహించడం లేదు.దీంతో భూమికి ఏ రసాయనాలు అవసరం.. ఎంతమోతాదులో వాడాలి.. భూమి లవణ శాతం ఎంత ఉందో తదితర విషయాలు తెలియని రైతులు వేసిన పంటలకు సరైన దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

- పరీక్షలకు అందుబాటులో లేని కిట్లు
- ఇష్టానుసారంగా ఎరువులు, రసాయనాల వినియోగం
- ఆందోళనలో రైతులు



దౌల్తాబాద్: పంటపొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించడంలేదు. పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు నిర్వహించక నేలలోని పోషక విలువల స్థితిగతుల గురించి తెలియక అన్నదాతలు అవగహన లేమితో ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. ఫలితంగా నేల నిస్సారమవుతోంది.

కనుమరుగైన కిట్లు

వ్యవసాయశాఖ అధికారులకు గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి భూసార పరీక్షలకు కావాల్సిన కిట్లను క్లస్టర్ల వారీగా వ్యవసాయ శాఖ అధికారులకు పంపిణీ చేసింది. కాగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేవని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. రైతు వేదికల్లోనూ కిట్లు కనపించడం లేదు. వాటిని జిల్లా కార్యాలయానికి అందించి ఉండవచ్చని ప్రస్తుత అధికారులు చెబుతున్నారు.

అవగాహన సదస్సులకే పరిమితం

వ్యవసాయశాఖ అధికారులు భూసార పరీక్షలు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం గురించి రైతు వేదికల్లో ప్రత్యేక సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఏయే విత్తనాలు ఎంపిక చేసుకోవాలో వివరిస్తున్నారు. కానీ భూసార పరీక్షలు నిర్వహించి ఎరువులు ఎంత మోతాదులో వేయాలో అవగహన కల్పిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. కిట్లు, రసాయనాలు లేక శిక్షకులు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

అన్నదాతలు అయోమయం

రైతులు సాగుపనులు మొదలుపెట్టే సమయంలో నేలస్వభావం తెలియాలి. నేలలో ఏ పంటలు పండిస్తే దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఎంత మోతాదులో ఎరువులు వినియోగించాలో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు.

ఆదేశాలు రాలేదు



భూసార నమూనాలు సేకరించాలని.. పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ఇక్కడ కిట్లు, పరీక్షలకు వాడే తగిన రసాయన ద్రావణాలు ప్రస్తుతం అందుబాటలో లేవు. ఇదే విషయం ఉన్నతాధికారులకు వివరించాం.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్



దాదాపూర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం అమర్నాథ్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ సంఘం సభ్యులు

హెచ్‌ఎంల నియామకం

దోమ: జిల్లా పరిషత్ పాఠశాలలకు కేటాయించిన గెజిటెడ్ నూతన ప్రధానోపాధ్యాయులు గురువారం విధుల్లో చేరారు. స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఆయా పాఠశాలలో విధుల్లో చేరారు. దాదాపూర్ జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడిగా డి.అమర్నాథ్, ఐనాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఏ.బాబుచంద్, మోత్కూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఎల్.మల్లేశ్వర్, దిర్సంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బి.వెంకటయ్య, దోమ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా జి.ఆంజనేయులు, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బి.శ్రీనివాసులు, గుండాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా మల్లారెడ్డి పదోన్నతి పొంది బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ప్రధానోపాధ్యాయులను పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఆర్.కేశవులు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి సంఘం సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు గోపాల్, లాల్య, జిల్లా బాధ్యులు భీమయ్య, వీరప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను రద్దు చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలను గుర్తించి, వెంటనే వారి బదిలీలను రద్దు చేయాలని సేవ్‌రంగారెడ్డి ఉద్యమ సంస్థ నిరుద్యోగ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో జరిగిన బదిలీల్లో అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్రమంగా జిల్లాకు వచ్చిన వారిని తిరిగి పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ ప్రతినిధి జి.ప్రవీణ్, నిరుద్యోగులు గట్టు విజయేందర్, పి.మహేశ్, రావుల లింగస్వామి, బత్తుల సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

పరీక్ష నిర్ణయం ఉపసంహరించుకోవాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

అనంతగిరి: ఆశ వర్కర్లకు పరీక్ష నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఆశవర్కర్ల నాయకులు మంగమ్మ, అమృత, ఉమా, సునీత, జగదేవి, అరుణ, పద్మ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన కల్పించండి

పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి



పంచాయతీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: అంటువ్యాధుల వ్యాప్తిపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆశ కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని.. ప్రజలు స్వచ్ఛత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. మురుగుకాల్వలు, నీరు నిలిచే ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటుగా చెత్తను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘాలకు శిక్షణ

ఇబ్రహీంపట్నం: కేంద్ర కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారి సహకారంతో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సెక్రటరీలు, రైతులకు ఉప్పరిగూడ పీఏసీఎస్‌లో శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల అభివృద్ధికి చేపట్టుతున్న సేవలను వివరిస్తూ, చేపట్టాల్సిన అంశాలను ఐసీఎం అధికారి శ్యామ్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. అలాగే, సహకార సంఘ చట్టం, విధి విధానాల గురించి, భవిష్యత్తు ప్రణాళిక, రుణాల రికవరీ, మల్టీసర్వీస్, ఆడిట్, నాయకత్వ బాధ్యతలపై ఆయన వివరించారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, సెక్రటరీ గణేశ్, ఇండియన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అధికారి శ్యామ్‌కుమార్‌లు పాల్గొన్నారు. కాగా, ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణతో పాటు ఫీల్డ్ విజిట్‌ను చేయనున్నారు.

నక్షబాటను కాపాడాలి

షాబాద్: మండలంలోని చందన్‌వెల్లి నుంచి చందన్‌వెల్లి చెరువు, అంతిరెడ్డిగూడ గ్రామం వరకు ఉన్న నక్షబాటను కబ్జాకు గురికాకుండా చూడాలని చందన్‌వెల్లి గ్రామస్తులు గురువారం తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చందన్‌వెల్లి నుంచి చందన్‌వెల్లి చెరువు, మాచన్‌పల్లి వరకు గత 400 సంవత్సరాలుగా నక్షబాట ఉంది.. కొంతమంది రోడ్డును మూసివేసి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, స్పందించి నక్షబాట కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు చేవెళ్ల స్వామి, నర్సింహ్మారావు, వేమారెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్, కిష్టయ్య, నరేష్, శ్రీనివాస్, సత్తయ్య, నర్సింహులు, కుమార్, రంగయ్య పాల్గొన్నారు.

పత్తి దిగుబడి పెంచాల్సిన బాధ్యత మనదే

- ఏరువాక కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ లక్ష్మణ్
- అధిక సాంద్రత, పత్తి సాగుపై ఏఓ, ఏఈఓలకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న లక్ష్మణ్, చిత్రంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తదితరులు

ధారూరు: ఏళ్ల నుంచి నిలకడగా ఉన్న పత్తి దిగుబడిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏరువాక కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కేరెల్లి రైతు వేదికలో అధిక సాంద్రత, పత్తి సాగుపై జిల్లాలోని ఏఓలు, ఏఈఓలకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక సాంద్రత, పత్తి ఆవశ్యకతను వివరించారు. పంటకాలం పూర్తైన తర్వాత జనవరిలో రెండో పంటగా మినుము, పెసర వేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులను వాడి, రసానిక ఎరువులను పూర్తిగా తగ్గించాలని సూచించారు. సేంద్రియ ఎరువుల ఆవశ్యతను ఆయన వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు వారి గ్రామాల్లో అధిక సాంద్రత పత్తిపైన అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు.

దిగుబడి పెంపు

తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం, ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ.. అధిక సాంద్రత, పత్తిలో పెరుగుదల నియంత్రణకు మందులను వాడి పంట ఎత్తును 100 సెంటీమీటర్ల కన్నా తక్కువగా ఉంచాలన్నారు. దీంతో ప్రతీ మొక్కకు 10 నుంచి 15 కాయలు వచ్చిన ఎకరాకు 25 వేల అధిక మొక్కల కారణంగా దిగుబడి పెరిగే అవకాశం ఉందని ఆమె సూచించారు. పత్తిలో ఎరువులు వేయడం, కలుపు మొక్కలు తీయడం, అధిక సాంద్రత, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అధిక సాంద్రత ఉన్న పత్తిలో పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ పరిమళ మాట్లాడుతూ.. అనువైన పత్తి రకాలు, వాటి గుణగణాల గురించి వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ యమున లింగాకర్షక బుట్టలు, వాడే విధానం, వాటి ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ స్వరూప, ఏఓ రూప్సీలక్ష్మి, వివిధ మండలాల ఏఓలు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట బ్యాంక్‌కాలనీలో నివాసముండే మర్ల యాదయ్య (57) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం కూలీ పనికి వెళ్తుండగా గండిమైసమ్మ ఆలయం సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల మరమ్మతు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ కుర్మల్‌గూడలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో ప్రారంభించనున్న పాఠశాల మరమ్మతు పనులను మేయర్ చిగురింత పారిజాత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి ప్రజలు ఉన్న ఈ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేయాలని విన్నవించామన్నారు. స్పందించి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి అనుమతులు ఇచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఇదే ప్రాంతంలో అంగన్‌వాడీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కకు విన్నవించినట్లు వెల్లడించారు. త్వరలో అంగన్‌వాడీ సెంటర్ మంజూరుతో పాటు టీచర్‌ను కూడా నియమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, డీఈఈ జ్యోతిరెడ్డి, నాయకులు బద్రమోని రమేష్, ఆనంద్‌రెడ్డి, మల్లారెడ్డి, జంపయ్య, సాధిక్, కుమారి, మైన, హరి, జహంగీర్, రమేష్ తదితరులున్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

తలకొండపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో పట్టుకుని బాధితులకు అందజేశారు. గురువారం ఎస్ఐ శ్రీకాంత్ ప్రకారం.. మండల కేంద్రంతో పాటు, చల్లంపల్లి, చీపునుంతల, పడకల్ గ్రామాలకు చెందిన నరసింహ, వరుణ్, నరసింహ, మహేశ్‌లు కొద్ది రోజుల క్రితం తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్ సహకారంతో సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

అటవీ భూములు దున్నారని..

- నలుగురిపై కేసు
- ట్రాక్టర్ సీజ్



పీసీఎం తండాలో అడవి భూమిని దున్నుతున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఎస్ఓ మొయినుద్దీన్

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని దోర్నాల్ బీట్‌లో మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను దున్నేసిన వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మొయినుద్దీన్ తెలిపారు. మార్చి నెలలో ఐదు ఎకరాల్లో ప్లాంటేషన్ చేయడానికి 2,500 మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేశారు. ఈ అటవీ భూమిని దోర్నాల్ గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్, ఆజం, చంద్రప్పలు కలియదున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేశామన్నారు.

పీసీఎం తండాలో ట్రాక్టర్ సీజ్

దోర్నాల్ బీట్‌లోని పీసీఎం తండాకు చెందిన లాలు నాయక్ రెండెకరాల అటవీ భూమిని ఆక్రమించి దున్ని చదును చేశాడు. గురువారం ట్రాక్టర్‌తో దున్నుతుండగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మొయినుద్దీన్ తన సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్‌చేసి ఫారెస్టు కార్యాలయానికి తరలించారు. లాలూనాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

దొంగల ముఠా సంచరిస్తోంది

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : రాత్రి సమయాల్లో దొంగల ముఠాలు సంచరిస్తున్నాయన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి హెచ్చరించారు. తాజాగా హయత్‌నగర్, శివారు రాచకొండ కమిషనరేట్ పరిసర ప్రాంతాల్లో ధార్ అనే భయంకరమైన దొంగల ముఠా సంచరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ గ్యాంగ్‌లో ఉత్తరప్రదేశ్‌కి చెందిన 5మంది కంటే ఎక్కువ సంఖ్యలో వ్యక్తులు దొంగల ముఠాగా ఏర్పడి, పట్టణ శివారు ప్రాంతాల్లో, చిన్నచిన్న లాడ్జిల్లో తాత్కాలికంగా నివాసం తీసుకుంటారని, ఈ గ్యాంగ్ వ్యక్తులు పగటి పూట రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామ శివారు ప్రాంతాల్లో నివసించే ఇళ్లు, గేటెడ్ కమ్యూనిటీలో నివసించే విల్లాలు, అపార్ట్‌మెంట్‌లను ఎంపిక చేసుకుని పగటి సమయాల్లో షేరింగ్ ఆటోలో తిరుగుతూ పరిశీలించి దోపిడీకి యత్నిస్తున్నారని చెప్పారు. ముఠా సభ్యులు రాత్రి సమయాల్లో ఇంటి మెయిన్ గేటు తెరవకుండానే ప్రహరీ గోడ దూకి ఇంటి తలుపులు తేరవమంటారని, డోర్ తీసిన తర్వాత ఇంట్లో ఉన్న వ్యక్తులను కొట్టి, చంపి ఇళ్లలో ఉన్న బంగారం, నగలు ఇతర విలువైన వస్తువులు దోచుకొని వెళ్తారని వెల్లడించారు. అనుమానంగా ఎవరైనా సంచరిస్తుంటే డయల్100కు సమాచారం ఇవ్వాలన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ : 87126 62302, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ 8712662650, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి ఫోన్ : 8712662293, ఎస్ఐ సునీల్‌కుమార్ ఫోన్ :8712662295, ఎస్ఐరమేష్‌నాయక్ ఫోన్ : 8712662291 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

అక్రమంగా సిలిండర్ల డంప్



సిలిండర్లతో పట్టుబడ్డ నిందితులు

మహేశ్వరం: అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లను స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు గురువారం దాడులు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాంకాలనీకి చెందిన త్రివిక్రం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని నర్సింహ మంచు టౌన్‌షిప్ సమీపంలో అక్రమంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను నిల్వఉంచాడు. సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి, రాజస్థాన్‌కు చెందిన మనీష్ బిష్ణోయి(19), రమేష్ బిష్ణోయి (28),ప్రేంరాజు బిష్ణోయి(29),సురేష్ బిష్ణోయి(29) లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సిలిండర్లతో పాటు ఒక బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ మార్కెట్‌లోకి విక్రయించేందుకు డంప్ చేసినట్లు పోలీసులు తెలిపారు. యజమాని పరారీలో ఉన్నాడు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



ఎక్సైజ్ పోలీసుల అదుపులో మహిళలు

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాడ్గుల మండలంలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి, ఇద్దరిని అరెస్టు చేశారు. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఎస్ఐ కృష్ణప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మండల పరిధిలోని పలు తండాల్లో దాడులు నిర్వహించారు. దాడుల్లో బావోజీ తండాకు చెందిన నేనావత్ చప్లి వద్ద 3 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ఆమె అరెస్టు చేశారు. కుబ్యతండా పరిధిలోని బావోజీతండాకు చెందిన నేనావత్ బిక్కి వద్ద ఉన్న వంద లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి బిక్కిని అరెస్టు చేశారు. పల్లెతండాలో 50 లీ టర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. వీటికి సంబంధించి మొత్తం నాలుగు కేసులను నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ తెలిపారు. గతంలో నాటుసారా కేసులో పట్టుబడిన వారిలో ఇద్దరిని తలకొండపల్లి తహసీల్దార్ వద్ద, మరో ఇద్దరిని కడ్తాల తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని సీఐ వివరించారు. సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.